క్లుప్తంగా

భద్రాద్రిలో తలంబ్రాల బియ్యం కలిపిన భక్తులు



ఏటూరునాగారం: భద్రాద్రి రామయ్య కల్యాణం మహోత్సవాలలో భాగంగా మండల కేంద్రానికి చెందిన సాయిబాబా ఆలయ మాజీ చైర్మన్ జాస్తి శ్రీకాంత్ ఆధ్వర్యంలో మూడు సంవత్సరాలుగా తలంబ్రాలు బియ్యం, పసుపు దచ్చేందుకు స్థానిక మహిళలు వెళ్తున్నారు. ఇందులో భాగంగానే మంగళవారం మండల కేంద్రానికి చెందిన వంగూరి శారద, వెంగళ మహాలక్ష్మి, బండపల్లి సుష్మ, కన్నోజు కృష్ణవేణి, పోలోజు మంజుల తరలివెళ్లి తలంబ్రాల బియ్యాన్ని కలిపారు. అలాగే పసుపును దచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా ఉందన్నారు.

అభివృద్ధి చెందాలి



వాజేడు: మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో మంగళవారం ఎస్సై రేఖ అశోక్ సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసులతో కలిసి కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామస్తులతో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తావివ్వొద్దని తెలిపారు. గ్రామస్తులు కలిసి కట్టుగా పనులను చేసుకుని అభివృద్ధి చెందాలని సూచించారు.

ఓపెన్‌కాస్ట్ మైన్‌కు నేషనల్ సేఫ్టీ అవార్డు

మల్హర్: మండలంలోని తాడిచర్ల ఓపెన్‌కాస్ట్ మైన్ నేషనల్ సేఫ్టీ అవార్డుకు ఎంపికైనట్లు తాడిచర్ల మైన్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్‌రెడ్డి, సీనియర్ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, మైన్ మేనేజర్ కేఎస్ఎన్ మూర్తి మంగళవారం తెలిపారు. గత (2017–2021) ఐదేళ్ల కాలంలో జీరో ప్రమాదాల కారణంగా జాతీయ సేఫ్టీ అవార్డుకు ఎంపికైనట్లు వారు పేర్కొన్నారు. దేశంలో 700 ఓపెన్‌కాస్ట్ కోల్ మైన్స్‌లలో తాడిచర్ల మైన్ ఎంపిక కావడం గర్వకారణమన్నారు. జెన్‌కో, ఏఎమ్మార్ అధికారులు, కార్మికుల కృషితో సాధ్యమైందన్నారు. జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు, డైరెక్టర్ టీఆర్‌కేరావు, ఏఎమ్మార్ ఎండీ. ఏ మహేష్ కుమార్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారులు, కార్మికులను ఈ సందర్భంగా అభినందించినట్లు వారు వివరించారు. ఈ స్ఫూర్తినే ఇలాగే కొనసాగించాలని రాబోయే రోజుల్లో మరింత రక్షణతో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించాలని సూచించినట్లు పేర్కొన్నారు.

చట్టబద్ధత కల్పించాలి

మహదేవపూర్: ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ బట్టు విజయ్ కుమార్ మాదిగ అన్నారు. ఈ మేరకు అంబట్‌పల్లిలో ప్రారంభమైన సంగ్రామ పాదయాత్ర రెండోవ రోజు మంగళవారం మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ బట్టు విజయ్ కుమార్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు 28 ఏళ్లుగా మద్దతు తెలిపిన బీజేపీ ప్రస్తుతం దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారంలో ఉండి కూడా పార్లమెంట్‌లో చట్టబద్ధత కల్పించడం లేదని అన్నారు. ఈ కార్యక్రమానికి మాదిగలు పెద్ద ఎత్తున కదలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వైన్ షాపు దగ్ధం

గణపురం: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో వైన్స్ షాపు దగ్ధమైన సంఘటన మండలంలోని చెల్పూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. చెల్పూరు గ్రామ పంచాయతీ పరిధిలోని సింగరేణి 1000 క్వార్టర్స్ సమీపంలో ఉన్న శ్రీ లక్ష్మీనరసింహ వైన్స్‌లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు ఏర్పడ్డాయి. ఈ ప్రమాదంలో సుమారు 10 లక్షల రుపాయల విలువ చేసే మద్యం దగ్ధమైంది. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఇద్దరికి గాయాలు

కాటారం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మండల కేంద్రం సమీపంలోని బొప్పారం మూలమలుపు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎంహెచ్40 బీఈ 0625 అనే నంబర్ గల కారు మహదేవపూర్ వైపు నుంచి కాటారం వైపుగా వస్తుంది. ఇదే క్రమంలో ప్రభుత్వ ఆస్పత్రికి సమీపంలోని బొప్పారం మూలమలుపు వద్ద ద్విచక్రవాహనం బొప్పారం వైపుగా రోడ్డుదాటుతుంది. ఈ క్రమంలో కారు ద్విచక్రవాహనాన్ని ఢీ కొట్టి అనంతరం అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకెళ్లింది. కారు ముందు భాగం నుజ్జు నుజ్జు కావడంతో పాటు బైక్‌పై వెళ్తున్న ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.

కలిసికట్టుగా రాణిస్తున్నారు..

ప్రభుత్వ ప్రోత్సాహంతో శివాపురంలో సబ్బుల తయారీ పరిశ్రమ ఏర్పాటు

- ఏడాదిలో రూ.1.20కోట్ల బిజినెస్
- ఆదర్శంగా నిలుస్తున్న గిరిజన మహిళలు



సబ్బులు తయారు చేస్తున్న మహిళలు

ఏటూరునాగారం: కలిసిగట్టుగా చేయి చేయి కలిపారు. ఒక్కటిగా ఏర్పడి గిరిజన కుటుంబాల్లో వెలుగులు నింపుకునేందుకు ప్రభుత్వం గిరిజన సంక్షేమశాఖ, ట్రైకార్, ఐటీడీఏ ద్వారా ఇచ్చిన ప్రోత్సాహంతో మండల పరిధిలోని శివాపురంలో గిరిజన మహిళలు సబ్బు పరిశ్రమను నెలకొల్పారు. జిల్లాలో ప్రథమంగా మొదలైన సబ్బుల పరిశ్రమ నిరంతరం నడుస్తోంది. ఏడాది నుంచి సబ్బులు తయారు చేస్తూ జీసీసీ, హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలకు సరఫరా చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు. ఒక ఏడాదిలోనే రూ.1.20కోట్ల వ్యాపారాన్ని మహిళలు సాధించారు. జిల్లాలోని ఏటూరునాగారం మండలంలోని శివాపురం మహిళలు కలిసికట్టుగా ముందుకు సాగుతూ పారిశ్రామికవేత్తలుగా నిలదొక్కుకున్నారు. వనదేవతలైన సమ్మక్క–సారలమ్మ పేరుతో ఏర్పాటు చేసిన సబ్బుల పరిశ్రమను పది మంది మహిళలు కలిసి భాగస్వామంగా నడుపుతున్నారు.

ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు

ఏటూరునాగారం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ఈ నూతన ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. డిటర్జెంట్ సబ్బుల తయారీ రంగాల్లో గిరిజన మహిలలకు హైదరాబాద్‌లో శిక్షణ ఇప్పించింది. నాబార్డు కింద పరిశ్రమ ఏర్పాటుకు రూ.60లక్షలను అందజేసింది. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తెలంగాణ గిరిజన సంక్షేమశాఖ నిరంతరం కృషి చేస్తోంది. ప్రస్తుతం 4.5 లక్షల సబ్బులు ఆర్డర్‌పై గిరిజన సహకార సంస్థ(జీసీసీ)కి అందించాల్సి ఉండగా 2లక్షల సబ్బులను తయారు చేసి సిద్ధంగా ఉంచారు. ఇంకా సబ్బులను తయారీ చేసేందుకు కావాల్సిన ముడి సరుకును నిల్వ చేసుకుంటున్నారు. ఒక్కో సబ్బుకు రూ.9ల చొప్పున జీసీసీ అందజేస్తారు. ఒక్కరోజు వారు నాలుగు వేల సబ్బులను తయారు చేస్తారు. జీసీసీ నుంచి ఐటీడీఏ పరిధిలోని గిరిజన వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, కళాశాలలకు సరఫరా చేస్తారు. గిరిజన మహిళలు తయారు చేసిన డిటర్జెంట్ సబ్బులకు రోజు రోజుకూ ఆదరణ పెరుగుతోంది. ప్రభుత్వం అందించే చేయూతతో గిరిజన మహిళలు సమష్టిగా కష్టపడుతూ ముందుకుసాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

మహిళా దినోత్సవం

ఇష్టంతో పనిచేస్తున్నాం..



ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి మా గ్రామంలో సబ్బుల తయారీ కంపెనీ నెలకొల్పడం ఆనందంగా ఉంది. కంపెనీని మా ద్వారా ఏర్పాటు చేయడంతో అందులో ఇష్టంతో పనిచేస్తున్నాం. సబ్బుల తయారీకి హైదరాబాద్‌లో శిక్షణ తీసుకున్నాం. 17 రకాల పదార్థాలతో సబ్బు తయారు చేస్తున్నాం. మహిళలంతా కలిసి సమష్టిగా పనిచేస్తున్నాం. అనుకున్న లక్ష్యాలను చేరుకుంటామనే నమ్మకం ఉంది.

– సౌజన్య, శివాపురం,
సబ్బు పరిశ్రమ అధ్యక్షురాలు

వేంకటేశ్వస్వామి తిరుకల్యాణం



తిరుకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారి తిరు కల్యాణ మహోత్సవం ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త శ్రీ రాజారాఘవ రంగరాజు ఆధ్వర్యంలో అర్చకులు మంగళవారం వైభవంగా నిర్వహించారు. కల్యాణమహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో చలువ పందిల్లు, తాగునీటి సౌకర్యంతో పాటు విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. సాయి భక్తమండలి, విజన్ పబ్లిక్ స్కూల్ ఆధ్వర్యంలో తాగు నీటి సౌకర్యం కల్పించారు. బీఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో లడ్డు ప్రసాదం అందజేశారు. భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో ముత్యాలమ్మ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో పులిహోర ప్యాకెట్లు, మంచినీరు అందించారు. నూగూరు మార్కెట్ కమిటీ చైర్మన్ బుచ్చయ్య, జెడ్పీటీసీ పాయం రమణ, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం వెంకట్రావ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంపా రాంబాబు, కార్యదర్శి పిల్లారి వెట్టి మురళి, బీసీ మర్రిగూడెం సర్పంచ్ అట్టం సత్యవతి, ఆలుబాక సర్పంచ్ ఈదిలక్ష్మి, దర్రా దామోదర్ గ్రామస్తులు వేల్పూరి లక్ష్మీనారాయణ ఉన్నారు.



తిరుకల్యాణానికి హాజరైన భక్తులు

మెరుగైన వైద్యం అందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య

ములుగు: ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ అల్లెం అప్పయ్య అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని మల్లంపల్లి సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయిన కారణంగా ఎనిమిది మంది విద్యార్థులను ఆస్పత్రిలో చేర్పించగా ఆయన మంగళవారం ఆస్పత్రిని సందర్శించి విద్యార్థులను పరామర్శించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ జగదీశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడి ఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆదివారం తల్లిదండ్రులు బయటి నుంచి తీసుకొచ్చిన ఆహారం తినడంతోనే పాయిజన్‌గా మారి ఉంటుందన్నారు. వరుసగా రెండు రోజుల పాటు వైద్య శిబిరం నిర్వహించాలని సిబ్బందిని సూచించారు. వివరాలను కలెక్టర్‌కు ఫోన్ ద్వారా సమాచారం అందించారు.

నాయకుల పరామర్శ

ములుగు రూరల్: గురుకుల పాఠశాలలో అస్వస్థతకు గురైన విద్యార్థులను కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ మంగళవారం ములుగు ఏరియా ఆస్పత్రిలో పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు నాసిరకం భోజనం అందించడంతో విద్యార్థులు అనారోగ్యం భారిన పడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్యార్థుల సమస్యలను గాలికి వదిలి వారికి అన్యాయం చేస్తున్నారని అన్నారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు నిర్లక్ష్యం కారణంగా విద్యార్థులు ఆస్పత్రి పాలయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, యూత్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్, ఆకుతోటగ చంద్రమౌళి, తిరుపతి, శ్యాం, మవ్వరపు తిరుపతిరెడ్డి, రేవంత్ యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా నాగులమ్మ జాతర

మంగపేట: మండలంలోని వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని లక్ష్మీనర్సాపురంలో శ్రీ నాగులమ్మ ఆలయంలో నాగులమ్మ జాతర మండెమెలుగు కార్యక్రమంతో మంగళవారం ప్రారంభమైంది. ఆదివాసీ గిరిజన సంస్కృతి సాంప్రదాయబద్ధంగా ఆలయ ప్రధాన పూజారి, నాగులమ్మ ఉపాసకుడు (ఆలయ ట్రస్టీ) బాడిష రామకృష్ణ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించి జాతరను ప్రారంభించారు. ఉదయం ఆలయాన్ని శుద్ధిచేసి నాగులమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి డోలీ వాయిద్యాల నడుమ ఆలయాన్ని మామిడాకుల తోరణాలతో అలంకరించారు. పవిత్ర గోదావరి నది జలాలతో పూజా అమ్మవారి ఆభరణాలు, గజ్జెలు, అడారాలను శుద్ధిచేసి పసుపు కుంకుమలతో అలంకరించారు. పూజారులు, వడ్డెలు, కులపెద్దలు ఆలయ ప్రాంగణంలో ఉన్న ఘడికామరాజు, పగిడిద్దరాజు, సమ్మక్క, సారలమ్మ, గోవిందరాజు, ఎర్రమ్మ, పోతురాజు, నాగులమ్మ నాగులమ్మ గద్దెలను పవిత్ర గోదావరి నది జలాలతో అభిషేకించారు. అమ్మవారి ప్రతి రూపాలైన జెండాలను డోలీ వాయిద్యాలతో భక్తి శ్రద్ధలతో గ్రామం నుంచి తీసుకువచ్చి ఆలయ ప్రాంగణంలోని ఆయా గద్దెలపై ప్రతిష్ఠించి పూజలు నిర్వహించారు. మండెమెలుగు కార్యక్రమంలో ప్రధాన ఘట్టమైన రహస్య పూజలను మంగళవారం రాత్రి నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన పూజారి రామకృష్ణ స్వామి తెలిపారు. నాగులమ్మ పూజారి బాడిష నాగరమేష్, నవీన్, సడాలమ్మ పూజారులు కొమరం ధనలక్ష్మి, నితిన్, పాపారవు, ఇర్ప నాగలక్ష్మి, వడ్డెలు సోడి సత్యం, కుర్సం పుల్లయ్య, ఈసం సమ్మక్క, కట్టం సమ్మక్క, ముయబోయిన శివ, కుర్సం నరేష్, కారం రాజేష్, సోడి శివనాగేశ్వరి, చౌలం భవాని, కుర్సం హేమలత, రమాదేవి, సుప్రజ, సీతక్క, సమ్మక్క, సుభలక్ష్మి, విష్ణుమూర్తి, మాధవరావు, నర్సింగరావు, రాజేశ్వర్‌రావు పాల్గొన్నారు.



డోలు వాయిద్యాలతో జెండా కర్రలను ఆలయానికి తీసుకువస్తున్న పూజారులు, వడ్డెలు



ఆలయ ద్వారం వద్ద కట్టడి పూజ చేస్తున్న పూజారి



గద్దెలకు అభిషేకం చేస్తున్న పూజారులు

మంగపేట: హోలీ వేడుకల్లో యువకులు



వెంకటాపురం(ఎం)లో..



ములుగు: హోలీ ఆడుతున్న ఓఎస్డీ అశోక్‌కుమార్



చిన్నారులతో హోలీ ఆడుతున్న డీఎంహెచ్‌ఓ అప్పయ్య



అంబరాన్నంటిన హోలీ వేడుకలు

జిల్లా వ్యాప్తంగా హోలీ వేడుకలను ప్రజలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్దలు, పిల్లలు, మహిళలు, యువకులు ఆనందోత్సవాల మధ్య రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ప్రజాప్రతినిధులు, ఆయా పార్టీల నాయకులు, అధికారులు సంప్రదాయ పద్ధతిలో వేడుకలను జరుపుకుంటూ ఒకరిపై ఒకరు కొడిగుడ్లు కొడుతూ సంబురాలు నిర్వహించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



ఏటూరునాగారం: ఏఎస్పీ సంకీర్త్‌కు రంగులు చల్లుతున్న మహిళలు



ఏటూరునాగారం: హోలీ వేడుకల్లో సీఐలు, ఎస్సైలతో ఏఎస్పీ సంకీర్త్



ములుగు: డాన్స్ చేస్తున్న పోలీసులు



ములుగులో హోలీ ఆడుతున్న యువత



ఏటూరునాగారంలో..



వాజేడు: జగన్నాథపురంలో..



వెంకటాపురం(కె)లో..



వెంకటాపురం(కె): బుట్టాయిగూడెంలో..



వాజేడు: రంగులు పూసుకుంటున్న కూలీలు



కన్నాయిగూడెం: చింతగూడెంలో..



ఏటూరునాగారం: హోలీ ఆడుతున్న చిన్నారులు



ఏటూరునాగారంలో..



మంగపేట: హోలీ వేడుకల్లో పోలీసులు



మంగపేట: వైష్ణవి పాఠశాలలో హోలీ వేడుకలు..



ఎస్ఎస్ తాడ్వాయిలో..



ఏటూరునాగారంలో..



ఏటూరునాగారం: హోలీ సంబరాల్లో ఆస్పత్రి సిబ్బంది



ఏటూరునాగారం: రంగులు చల్లుకుంటున్న నాయకులు